
కథ

# తీరనికోరిక

- పల్లేటి నిర్మల



ఒక సాయంకాలం భర్తతో కలసి ఫస్ట్ షో సినిమాకు వెళ్ళాలి. సినిమా చూసిన తర్వాత ఒక మంచి రెస్టారెంట్‌కు వెళ్ళి తృప్తిగా మంచి టిఫిన్ చేయాలి. ఆ తర్వాత హాయిగా ఇంటికి తిరిగి రావాలి. పెళ్ళి కాక ముందు నుంచి నా కున్న ఒకే ఒక కోరిక అదే!

పెళ్ళయిన తర్వాత నా కోరికను నా భర్త శ్రీధర్ ముం దుంచాను. ఆయనగారు - "చూడు సుజా! నే నో మధ్యతరగతి ఉద్యోగస్తుడిని. ఇలా సినిమాలకు, షికార్లకు అనవసరంగా మనం ఖర్చు పెట్టుకొంటూ పోతే, చివరకు మనకు అప్పులు మిగులుతాయి. అందుకని మనం అనవసరంగా ఖర్చులు పెట్టకుండా పొదుపుగా సంసారం చేసుకుంటే మంచిది..." అని పొదుపును గురించి, దాని ఉపయోగాల గురించి దాదాపు అర్థ గంట లెక్చ రిచ్చారు.

ఆ రోజు నుంచీ నా కోరికను దాచుకున్నాను. నా భర్త కోరికలు తీరుస్తూ [అవి చాలా పొదుపైనవే సుమా!] ఆయనగారి ఆజ్ఞల ప్రకారం ఎంతో పొదుపుగా సంసారాన్ని ప దేళ్ళు నెట్టుకొచ్చాను.

నాకూ, నా భర్తకూ మధ్య తొమ్మి దేళ్ళ బిందు, ఆరేళ్ళ కిరణ్ ఉన్నారు. ప్రస్తుతం అంటే భార్యా భర్తలుగా ఉన్న మేం రెండు రెళ్ళు నాలు గయ్యాం.

నా కున్న ఒకే ఒక కోరిక నాలోనే ఉంది. కాకపోతే కొద్ది రూపాంతరం చెందింది. అదేం టంటే ఒక సాయంకాలం భర్తా, పిల్లలతో కలసి ఫస్ట్ షో సినిమాకు వెళ్ళాలి. ఆ తర్వాత రెస్టారెంటుకు వెళ్ళి తృప్తిగా మంచి టిఫిన్ చేయాలి'.

నా కున్న నా కోరికను నా భర్త ముందు పెట్టనే లేదు. ఒకవేళ పెట్టినా ఆయన దాన్ని తీరుస్తా డన్న ఆశ లేదు. నా కోరిక తీరని కోరికగా మిగిలిపోతుందేమో అన్న అనుమానం నాలో బలపడసాగింది. అందుకు కారణం ఈ పదేళ్ళలో పొదుపు విషయంలో నా భర్తగారు ఏ కొద్ది కూడా మారలేదు. ఒక రకంగా చెప్పా లంటే ఆయన పొదుపు వల్ల ఈ రోజు ఆర్థికంగా ఎంతో స్తిమితంగా ఉన్నాం. అదే ఆయన తోటి ఉద్యోగులూ, ఆయన కంటే ఎక్కువ జీతం తెచ్చుకునే ఉద్యోగులూ కూడా రెండో వారం నుంచే అప్పుల వేటలో పడుతున్నారు.

ఆయన మాత్రం అమ్మాయి పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో పెళ్ళికి సరిపోయేంత వేశారు. అంతేకాదు, అబ్బాయి చదువు ఏ ఆటంకం కలగకూడదని వాడి పేరుతో రికరింగ్ డిపాజిట్ క్రమం తప్పకుండా వేస్తున్నారు. ఇకపోతే మా ఇద్దరికీ, అంటే ఆయనకూ, నాకూ వార్ధక్యంలో ఎంత అవసర మవుతుందో అంతా వంతుల వారీగా ఇప్పటి నుంచే దాస్తున్నారు. ఇక మిగిలిం దాంతో ఎంతో పొదుపుగా జరిపితే తప్ప మా సంసారం జరగదు.

మా పిల్లలకు బజారుకు వెళ్ళి పావలా చాక్లెట్ కొనుక్కోవడం కూడా ఎంతో గొప్ప. నాకు అవసరానికి మించిన చీరలు లేవు. పిల్లలకు యూనిఫారాలు, ఇంటి దగ్గర వాడుకోవడానికి మంచి బట్టలు [అంటే ఖరీదైనవి కాదు] తప్ప చెప్పుకోతగ్గ బట్టలు లేవు.

ఆయన బట్టల పరిస్థితీ అంతే పాపం! ఆయన స్వయంగా జేబులోని డబ్బు తీసి ఒక్కసారి కూడా టీ తాగి ఉండ రేమో? అటువం టాయన నా కోరిక తీర్చలే దంటే అందుకు బాధపడ నవసరం లేదు కనుకనే, నేను బాధపడటం లేదు.

స్కూలు నుంచి వచ్చిన పిల్లలకు మొహాలు శుభ్రంగా కడిగాను. ఇంట్లో చేసి ఉంచిన తినుబండారాలు వాళ్ళ కిచ్చి "తినేసి కూర్చుని చదువుకోండి" అన్నాను.

వాళ్ళకు చదువు గురించి నేను ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వాళ్ళే చదువుకుంటారు. లేకపోతే నేను ఉండబట్టలేక చెప్పా నంతే.

"సుజా! మంచి స్ట్రాంగ్ కాఫీ ఇవ్వు. నీ కో శుభవార్త చెపుతాను." ఆఫీసు నుంచి అప్పుడే వచ్చిన ఆయన ఆనందంగా నవ్వుతూ చెప్పారు.

"ఏంటండీ ఆ శుభవార్త?" ఆత్రత పట్టలేక అడిగాను.

"ముందు కాఫీ తేవేయ్!" నా బుగ్గ మీద చిటికేస్తూ చెప్పా డాయన. ఆయన మంచి సరసుడు. సరదా ఉంటాడు కూడా. అప్పు డప్పుడు బుగ్గ మీద చిటి కెయ్యడం, చిలిపిగా మాట్లాడడం చేస్తుంటాడు.

ఆయన చెప్పబోయే శుభవార్త ఏమై

ఉంటుందా - అని ఆలోచిస్తున్న నేను కాఫీలో కాస్త వంచదార ఎక్కువ వేశానని రుచి చూసిన తర్వాత తెలుసుకున్నాను.

కాఫీ కప్పు అందుకొని ఒక గుక్క తాగిన తర్వాత "శుభవార్త కోసం తీపి ఎక్కువ వేసినట్లున్నావ్?" అని కాఫీ తాపీగా తాగసాగారు.

నా కైతే ఆ శుభవార్త ఏమిటా అని మెదడు నరాలు చిట్లిపోతున్నాయ్. "నన్ను టెన్షన్‌లో పెట్టి చంపకుండా ఆ శుభవార్త ఏమిటో చెప్పండి" అన్నాను.

"తొందరపడకోయ్! కాస్త ఆగు.." అని కాఫీ కప్పు కింద పెట్టి, "చూడు! ప్రతి సంవత్సరం బోనస్ కింద ఒక నెల జీతం ఇచ్చేవారుగా?" అన్నా డాయన.

**ఆమెది అతి సాధారణమైన కోరిక. ఇక జన్మలో తీరదనే అనుకుంది. అనుకోకుండా ఆ కోరిక తీరే అవకాశం వచ్చింది. తీరా తీర్చుకోబోయేసరికి...! మరి తీరిందో, లేదో చెబుతుం దీ కథ.**

"అవును. అది మీరు ఎప్పుడూ ఏదో నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ కొనేందుకు పెట్టుబడిగా పెడతారుగా?" అన్నాను.

"అవును. ఈ సంవత్సరం కూడా నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ కొన్నాను" అన్నాడు.

"అందులో పెద్ద శుభవార్త ఏముంది?" అన్నాను నేను.

"అక్కడే ఉంది కిటుకు. ప్రతి సంవత్సరంలా కాకుండా ఈ సంవత్సరం మూడు నెలల జీతం బోనస్‌గా ఇచ్చారు." ఆనందంగా చెప్పా డాయన.

"అవునా?" ఎంతో ఆశ్చర్యంగా అడిగాను.

"అవును. అందు కనే ప్రతి సంవత్సరంలా ఒక నెల జీతా నికి సరిపడా డబ్బుకే. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ కొన్నాను. మిగిలిన రెండు నెలల బోనస్ డబ్బును నీ ఇష్ట ప్రకారం ఖర్చు పెట్టా లనుకుంటున్నాను" అన్నాడు.

జీవితంలో పె ళ్ళయిన తర్వాత మొట్టమొదటిసారిగా ఎంతో ఆశ్చర్యపోయాను. "నిజంగానా?" ఆశ్చర్యపోతూనే అనుమానంగా అడిగాను.

"అవును. దాదాపు నాలుగు వేల రూపాయలు ఉంది. నీ ఇష్ట ప్రకారం ఖర్చు పెట్టు. నేను ఏమాత్రం అడ్డు చెప్పను" అని నాలుగు వేల రూపాయలు నా చేతిలో పెట్టారు.

నా ఆనందానికి అవధులు లేవని మళ్ళీ ప్రత్యేకంగా చెప్ప నవసరం లే దనుకుంటాను. నాలో దాగి ఉన్న నా కోరిక గుర్రంలా ఒక్కసారి ఎగిరింది.

తర్వాత "మమ్మీ! క్లాసులో పిల్ల లందరూ పుట్టిన రోజు లప్పుడు పట్టు పావడా, జాకెట్ వేసుకొస్తారు." 'నాకూ కొనివ్వు' అని అడగకుండా అడిగిన బిందు మాటలు గుర్తొచ్చాయి. ఆ తర్వాత "మమ్మీ! మరేమో రాజీవ్ గాంధీ డ్రెస్సు ఒకటి కొనివ్వవూ?" అని అడిగిన కిరణ్ మాటలు గుర్తొచ్చాయి. వా ళ్ళిద్దరికీ అవి కొనివ్వాలి అని నిశ్చయించుకున్నాను.

వెంటనే ఆయనకు మంచి బట్టలు లేని విషయం గుర్తొచ్చింది. అందు కనే ఆయనకూ మంచివి నాలుగు జతల బట్టలు కొనివ్వాలని నిర్ణయించుకున్నాను.

ఆ రాత్రి ఆయనతో - "ఏమండీ! బిందు కో మంచి పావడా - జాకెట్టు, బుజ్జిగాడికి రాజీవ్ గాంధీ డ్రెస్సు కొనిద్దామండీ. రేపు మీరు సెలవు పెట్టండి. అందరం కలసి బజారుకి వెళ్దాం" అన్నాను.

"అలాగే!" అన్నాడు.

ఏ మూడ్‌లో ఉన్నాడో సంతోషంగా బజారుకి వెళ్ళేందుకు ఒప్పుకున్నా డని నాకు ఎంతో సంతోషం వేసింది. "ఏమండీ! మీకూ నాలుగు జతలు మంచి బట్టలు కొనుక్కోండి." మెల్లగా అన్నాను.

కొద్దిసేపటి మౌనం తర్వాత - "చూడు సుజా! నువ్వూ ఖరీదైన చీర ఒకటి తీసుకో" అని బుగ్గ గిల్లాడు.

నేనూ కొద్ది క్షణాలు ఆలోచించి మంచి మైసూర్ సిల్క్ చీర కొనుక్కోవాలని నిర్ణయించుకున్నాను. [illegible] విషయాన్ని మెల్లగా ఆయనతో చెప్పాను.

"అలాగే!" అని మెల్లగా లైట్ స్విచ్ ఆఫ్ చేశా డాయన.

బెడ్ రూం మొత్తం చీకటి ఆక్రమించుకుంది.

*** *** ***

బజారు నుంచి కొనుక్కొచ్చిన కొత్త బట్టల్ని చూసి పిల్ల లిద్దరూ ఎంతో ఆనందించారు. బట్టలు కొనగా రెండు వందల రూపాయలు మిగిలాయి. అందుకని ఆ రాత్రి "సుజా! రెండు వందల రూపాయలు మిగిలాయిగా ఏం చేద్దా మనుకుంటున్నావు?" అని నన్ను అడిగారు.

"మీ ఇష్ట మండీ" అన్నాను.

అయితే లోపల మాత్రం నాకు హాయిగా పిల్లలు, భర్తతో కలిసి సినిమాకు వెళ్ళాలి. వచ్చేటప్పుడు మంచి రెస్టారెంటుకు వెళ్ళి టిఫిన్ చేసి, సంతోషంగా ఇంటికి తిరిగి రావాలి అన్న కోరిక మళ్ళీ విజృంభించింది. అందుకనే దాన్ని గురించే ఆలోచిస్తూ ఉండిపోయాను నేను.

నా ఆలోచనలను చెదరగొడుతూ "సుజా! ఆ రెండు వందల రూపాయలు కూడా నీ ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేసెయ్!" అన్నా డాయన.

"ఏమండీ! ఆదివారం రోజు పిల్లలకు కూడా సెలవు కదా. అందుకని ఆదివారం మనం పిల్లలతో కలసి మంచి సినిమాకు వెళ్దా మండీ" అన్నాను.

"ఓకే!" అంటూ ఒప్పుకున్నాడు.

"ఆ తర్వాత మంచి రెస్టారెంట్‌కు వెళ్ళి అందరం టిఫిన్ చేసి ఇంటికి తిరిగి వచ్చేద్దా మండీ!" మెల్లగా చెప్పాను.

"ఓకే, నీ ఇష్టమే!" అని నవ్వాడు.

నా ఆనందానికి నిజంగా అవధులే లేవు. అందుకు కారణం - పెళ్ళి కాక ముందు నుంచి నా కున్న తీరని కోరిక తీరబోతున్నందుకే అని ప్రత్యేకంగా చెప్పక్కరలే దనుకుంటాను.

*** *** ***

ఆనందంగా నేను ఎదురు చూస్తున్న ఆదివారం అతి తొందరగా వచ్చేసింది. బిందుకు పట్టు పావడా - జాకెట్టు, బుజ్జిగాడికి రాజీవ్ గాంధీ డ్రెస్సు వేసి రెడీ చేశాను. ఆయన ముచ్చటపడి ఎన్నిక చేసిన ఆకుపచ్చ మైసూర్ సిల్క్ చీర సింగారించుకొని ఆయన ముందు సిగ్గు లొలకబోశాను.

"నా డ్రెస్సు చూసి సిగ్గుపడుతున్నావా?" కొత్త డ్రెస్సులో కొంటెగా మాట్లాడా డాయన.

"సినిమాకు టైం అవుతుంది. పదండి" అన్నాను.

రిక్షాలో సినిమా హాలు దగ్గరకు వెళ్ళిన మా కంటికి కొండవీటి చాంతాడు లాంటి క్యూ కనిపించేసరికి గుండె జల్లు మంది.

"టిక్కెట్లు దొరుకుతాయో లేదో తొందరగా వెళ్ళి క్యూలో నిల్చోండి" అని ఆయన్ని తొందర చేశాను. ఆయన వెళ్ళి క్యూ చివర నిల్చున్నాడు. నేనూ, పిల్లలూ వెళ్ళి ఒక మూల నిల్చున్నాము. క్యూ మెల్లగా నత్త నడక నడవసాగింది.

"ఆయన దగ్గరకు వచ్చేసరికి టిక్కెట్లు దొరుకుతాయో, లేదో అన్న అనుమానం ఏర్పడింది నాకు. క్యూ కదులుతోంది. ఆయన ముం దున్న నలుగురూ టిక్కెట్లు తీసుకొని వెళ్ళిపోయారు. ప్రస్తుతం టిక్కెట్ కోసం నిలబడి ఉండేది ఆయన. ఆయన వెనక ఓ పది మంది.

టిక్కెట్లు తీసుకోకుండా మౌనంగా నిలబడి ఉన్నా డాయన. ఆయనలో ఏదో మార్పు కొట్టొచ్చినట్లు కన్పిస్తూంది నాకు.

"తొందరగా టిక్కెట్లు తీసుకొని నడవవయ్యా!" వెనకున్న వారు కొద్ది గట్టిగా అనడం నాకు విన్పించింది.

ఏమై ఉంటుందా - అని ఆయన దగ్గరకు నేను వెళ్ళే సరికి ఆయన వెనక ఉన్న వ్యక్తి ఆయన్ని పక్కకు నెట్టి ముందు కెళ్ళడం జరిగింది.

"ఏమైందండీ?" ఆత్రుతగా అడిగాను నేను.

"జేబులో రెం డొందలు ఉన్న పర్సు కనిపించడం లేదు!" బ్లేడుతో చాలా చక్కగా, నేర్పుగా కత్తిరించిన ఆయన కొత్త పాంటు వైపు చూపిస్తూ చెప్పారు.

ఆయన జేబు చూసిన నా నోటి వెంట ఏ మాటా రాలేదు. పది నిముషాల తర్వాత తేరుకొని - "పదండి ఇంటికి వెళ్దాం!" అన్నాను.

భర్తా పిల్లలతో ఇంటి వైపు దిగులుగా నడుస్తు నాకు ఆయన డబ్బులు పోగొట్టుకున్న బాధ కంటే, నా కోరిక తీరనందుకు ఎక్కువ బాధ కలిగించింది. అందుకనే మౌనంగా తల వంచుకొని ఇంటి వైపు నడవసాగాను. *